సాక్షి కర్నూలు

సోమవారం | 30 | అక్టోబర్ | 2023



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం పల్నాడుకు చెందిన సుధాకరరెడ్డి రూ.1,00,116లు విరాళంగా అందజేశారు.



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలం: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం శాస్త్రోక్తంగా పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



ట'మాట'ను నిలబెట్టేలా!

పత్తికొండలో టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ఇటీవలే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలోనే భూమి పూజ నిర్వహించే అవకాశం ఉంది. 8లో▸

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో స్పందన

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ముగిసిన సోషల్ ఆడిట్

కర్నూలు(అగ్రికల్చర్): ఈ–క్రాప్ బుకింగ్ ప్రక్రియకు సంబంధించి సోషల్ ఆడిట్ కార్యక్రమంతో పాటు గ్రామసభలు పూర్తయ్యాయి. పంట నమోదుకు సంబంధించి 433, విత్తన రకాల్లో తేడాలకు 355, పంట సాగు విస్తీర్ణంలో 23, నీటిపారుదల విషయంలో 114, పంట వేసిన తేదీ విషయంలో 69 ప్రకారం మొత్తం 1100 అభ్యంతరాలు వచ్చాయి. వీటిని పరిష్కరించడంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు నిమగ్నమయ్యారు. ఖరీఫ్ సాధారణ సాగు 10.42 లక్షల ఎకరాలు ఉండగా, 10,17,601 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. సాగు చేసిన పంటలను 100 శాతం ఈ–క్రాప్‌లో నమోదు చేశారు. దాదాపు 3.26 లక్షల మంది రైతులతో ఈ–కేవైసీతో ధ్రువీకరించారు.

వన్‌టౌన్ సీఐగా పవన్‌కుమార్



కర్నూలు: కర్నూలు వన్‌టౌన్ సీఐగా వై. పవన్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్పీ కృష్ణకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడున్న తిమ్మారెడ్డి బదిలీ కావడంతో సీసీఎస్ సీఐ నాగేశ్వర్ నాలుగు నెలలుగా ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. పూర్తిస్థాయిలో పవన్‌కుమార్‌ను నియమించడంతో ఆయన ఆదివారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన పవన్‌కుమార్ 2009లో ఎస్‌ఐ హోదాలో పోలీసు శాఖలో చేరి జిల్లాలోని జూపాడుబంగ్లా, బ్రాహ్మణకొట్కూరు, పాములపాడు, కర్నూలు త్రీటౌన్, కర్నూలు ట్రాఫిక్, సి.బెళగల్, గూడూరు, ఆదోని టూటౌన్, సీఐడీ, ఇంటెలిజెన్స్ విభాగాల్లో పనిచేశారు. ఈ ఏడాది ఆగస్టు 17న సీఐగా పదోన్నతి పొంది పోస్టింగ్ కోసం ఎదురు చూస్తుండగా వన్‌టౌన్ సీఐగా నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

శ్రీశైలంలో 69 టీఎంసీలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 69.7540 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. జలాశయ నీటిమట్టం 844.80 అడుగులకు చేరుకుంది. శనివారం నుంచి ఆదివారం వరకు జలాశయం నుంచి 5,018 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు వదిలారు. ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 0.270 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి 511 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జున సాగర్‌కు విడుదల చేశారు. పోతిరెడ్డిపాడు గేట్లను మూసివేశారు.

హక్కు భద్రం.. పత్రాలు సిద్ధం

- త్వరలో దళితుల చేతుల్లోకి 'హక్కు' పత్రాలు
- నాడు రుణాలు మాఫీ చేసిన వైఎస్సార్
- తనఖాలో ఉన్న డాక్యుమెంట్ల విడుదలకు 51 జీఓ జారీ
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 3,533 దళిత కుటుంబాలకు లబ్ధి




కర్నూలు(అర్బన్): సమాజంలో దళితులు గౌరవంగా బతికేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వారి ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక జీఓలు జారీ చేస్తోంది. ఈ కోవలోనే ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన భూములపై సంపూర్ణ హక్కులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అంతే కాకుండా హక్కు పత్రాలను సైతం ముద్రించి జిల్లాకు పంపింది. దీంతో దళిత కుటుంబాల్లో ఆనందాలు వెల్లివిరుస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1982 నుంచి 2014 వరకు భూమి కొనుగోలు పథకంలో భాగంగా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పలువురు దళితులు భూములు పొందారు. వీరికి రూ. లక్ష లోపు రుణాలను మాఫీ చేస్తూ వైఎస్సార్ హయాంలో జీఓ నంబర్492ను జారీ చేశారు. అయితే రుణాలు మాఫీ అయినా ... భూములకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లు ఎస్సీ కార్పొరేషన్‌లో తనఖాలోనే ఉండి పోయాయి. భూములు పొంది వ్యవసాయం చేసుకుంటున్న దళితులు హక్కు పత్రాల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌లో తనఖాలో ఉన్న డాక్యుమెంట్లను రిలీజ్ చేసి, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను అందించేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే ప్రభుత్వమే ముద్రించిన భూ యాజమాన్య హక్కు పత్రాలు జిల్లాకు చేరాయి.

5.058 ఎకరాలకు స్వేచ్ఛ

ఎస్సీకార్పొరేషన్‌లో తనఖాలో ఉన్న భూములకు సంబంధించి యాజమాన్య హక్కు పత్రాలను లబ్ధిదారులకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఈ ఏడాది ఆగస్టు 8వ తేదిన జీఓ నంబర్ 51ని జారీ చేసింది. ఈ జీఓ ప్రకారం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని లబ్ధిదారుల భూములకు యాజమాన్య హక్కు పత్రాలు అందించడంతో పాటు రిజిస్ట్రేషన్ చార్జెస్‌ను కూడా ప్రభుత్వం భరించనుంది. ఒక్కో లబ్ధిదారునికి భూమిని రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చేందుకు రూ.1,200 ప్రకారం 3,533 మంది లబ్ధిదారులకు అయ్యే ఖర్చు రూ.42,39,600లను ప్రభుత్వమే భరించనుంది. ఈ పథకం కింద భూములు పొందిన లబ్ధిదారులు ఎవరైనా మృతి చెందివుంటే వారి వారసుల వివరాలను పక్కాగా సేకరించి వారికి యాజమాన్య హక్కు పత్రాలను అందించనున్నారు. అలాగే జీఎంఎస్ 501 ప్రకారం రిజిస్ట్రేషన్ చార్జెస్, యూజర్ చార్జీలను కూడా ప్రభుత్వమే భరించి హక్కు పత్రాలను అందించనుంది.

దళిత రైతులకు యాజమాన్య హక్కులు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రుణాలు మాఫీ అయినా ఎస్సీ కార్పొరేషన్‌లోనే ఉన్న దళిత రైతులకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లను వారికి అందించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 3,533 మంది రైతులకు సంబంధించి రూ.5.26 కోట్ల రుణాలు అప్పట్లోనే మాఫీ కావడం, దళిత రైతుల కష్టాలను తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 5,058ఎకరాలకు యాజమాన్య హక్కులు లభించనున్నాయి. ఇందులో కర్నూలు జిల్లాలో 2,794, నంద్యాల జిల్లాలో 2,264 ఎకరాలు ఉన్నాయి.



ప్రభుత్వం జారీ చేయనున్న భూయాజమాన్య హక్కు పత్రం

లబ్ధిదారుల వివరాలు ...

జిల్లా	మొత్తం లబ్ధిదారులు	అందించిన భూములు ఎకరాల్లో
కర్నూలు	1,762	2,794
నంద్యాల	1,771	2,264
మొత్తం:	3,533	5,058

చాలా సంతోషంగా ఉంది



అప్పట్లో మాకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సర్వే నంబర్: 411–ఏ7లో 0.68 ఎకరాల భూమిని మార్జిన్‌మనీ, సబ్సిడీపై ఇచ్చారు. నాటి నుంచి నేటి వరకు ఆ భూమిని నమ్ముకొని వ్యవసాయం చేసుకుంటున్నాం. హంద్రీలో నీరు ఉంటే వరి, లేని పక్షంలో మొక్కజొన్న, జొన్న పంటలు పండించుకుంటున్నాం. అయితే ఆ భూమికి సంబంధించి ఇంకా అప్పు ఉండడంతో పత్రాలు ఎస్సీ కార్పొరేషన్‌లోనే ఉన్నాయి. పేదోళ్ల దేవుడు వైఎస్సార్ అప్పులు మాఫీ చేయడం, జగనన్న దయ వల్ల మా భూమికి సంబంధించిన రిజిష్టర్ పత్రాలు ఇస్తున్నట్లు అధికారులు చెప్పడం చాలా సంతోషంగా ఉంది.

–లక్ష్మమ్మ, బస్తిపాడు, కల్లూరు మండలం

త్వరలోనే యాజమాన్య హక్కు పత్రాలు



భూమి కొనుగోలు పథకానికి సంబంధించి మా కార్యాలయంలో తనఖాలో ఉన్న హక్కు పత్రాలను అందించేందుకు చర్యలు చేపడుతున్నాం. భూయాజమాన్య హక్కు పత్రాలను ప్రభుత్వమే ముద్రించి పంపింది. త్వరలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ హక్కు పత్రాలను లబ్ధిదారులకు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం జిల్లాలో హక్కు పత్రాలను అందించనున్నాం. ప్రభుత్వం నుంచి వచ్చిన హక్కు పత్రాల్లో లబ్ధిదారుని పేరు, చిరునామా, విస్తీర్ణం, హద్దులు తదితర వివరాలన్నీ ఉన్నాయి.

– ఎస్ శ్రీనివాసకుమార్, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్

విద్యుత్ బిల్లుల వసూలుపై ప్రత్యేక దృష్టి

- డబ్బు కట్టని కనెక్షన్లు 1 నుంచి తొలగింపు
- డివిజన్ల వారీగా ప్రత్యేక అధికారుల నియామకం

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లుల వసూలుపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. బిల్లు పెండింగ్‌లో ఉన్న కనెక్షన్లను నవంబరు 1వ తేదీ నుంచి తొలగించేందుకు సిద్ధమవుతున్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా సర్వీసుల తొలగించడంతో పాటు వాటిపై అపరాధ రుసుం, డిస్కనెక్షన్ చార్జీలు వేయనున్నారు. ఇందుకోసం డివిజన్ల వారీగా ప్రత్యేక అధికారులను నియమించారు. కర్నూలు టౌన్ డివిజన్‌కు ఏడీఈ రంగస్వామి, ఆదోని డివిజన్‌కు ఏడీఈలు మక్బూల్ బాషా, రామకృష్ణ, నంద్యాలకు ఏడీఈ సుబ్రహ్మణ్యంను నియమించారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఇప్పటి వరకు బిల్లులు కట్టని వినియోగదారులు వెంటనే చెల్లించి సహకరించాలని కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి కోరారు.

కోటా కంటే అదనంగా వాడకం

విద్యుత్ లోటు కారణంగా ఒక యూనిట్ ను రూ.18 ధరతో కొనుగోలు చేసి, సబ్సిడీపై అందిస్తున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అన్ని కేటగిరీల్లో 16.54 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా వీటికి రోజుకు 1.80 కోట్ల నుంచి 2 కోట్ల వరకు యూనిట్ల డిమాండ్ ఉంది. నెలలో రోజు వారీ కోటా 13.790 మిలియన్ యూనిట్లు కాగా ప్రస్తుతం 15 నుంచి 18 ఎంయూల యూనిట్లు (కోటా కంటే 50 లక్షల నుంచి 65లక్షల వరకు అదనంగా) వాడుతున్నారు. వీటిలో ప్రైవేటు ఎల్‌టీ, హెచ్‌టీ కనెక్షన్ల నుంచి ఈ నెలకు రూ.166.21 కోట్లు బిల్లుల రూపంలో రావాల్సి ఉంది. అయితే ఆదివారం నాటికి రూ.120కోట్లు మాత్రమే వచ్చాయి. మిగిలిన రూ.46కోట్ల రావాల్సి ఉండగా దీనిలో కర్నూలుకు చెందిన బడా పారిశ్రామికవేత్త రూ.16 కోట్లు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఈ నెల రూ.171కోట్లు రావాల్సి ఉండగా రూ.15 కోట్లు మాత్రమే వచ్చాయి.

వైభవంగా పవిత్రోత్సవాలు

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో వార్షిక పవిత్రోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం తెల్లవారు జామున మూలవిరాట్ శ్రీ ప్రహ్లాదవరదస్వామి, అమృతవల్లీ అమ్మవార్లకు నిత్య పూజల అనంతరం ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరద స్వాములను కొలువుంచి వేద పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య పవిత్ర హోమం నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తులను నూతన పట్టు పీతాంబరాలతో ముస్తాబుచేసి పల్లకీలో కొలువుంచి మంగళ వాయిద్యాల మధ్య మాడ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ పూజలు ప్రధానార్చకులు వేణుగోపాలన్, మణియార్ సౌమ్యానారాయణ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు.



గ్రామోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

- రూ.1.80 లక్షల నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం

ఆదోనిఅర్బన్: పట్టణంలో క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న ఆరుగురిని ఆదోని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక మరాఠిగేరికి చెందిన ప్రకాష్, వాల్మీకినగర్‌కు చెందిన ఎలకటి మహేష్ , నరసింహులు, బోయగేరికి చెందిన నరసప్ప, శంకర్‌నగర్‌కు చెందిన చిరంజీవి, బి.ఈశ్వర్ టీజీఎల్ కాలనీ నుంచి మైనార్టీ కాలనీకి వెళ్లే రహదారిలో ఖబరస్తాన్ వద్ద నాటు సారా తయారు చేస్తూ ఇండియా– ఇంగ్లాడ్ మ్యాచ్‌కు సంబంధించి క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ విక్రమసింహ తమ సిబ్బందితో కలిసి దాడి చేశాడు. పై ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1.80 లక్షలు నగదు, ఆరు సెల్ ఫోన్‌లు, 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ శివనారాయణ స్వామి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. దాడుల్లో ఏఎస్‌ఐ అబ్దుల్‌సమద్, కానిస్టేబుళ్లు లక్ష్మన్న, రామచంద్ర, రంగస్వామి, సుధీర్‌కుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

జీవనోపాధులతో పేదరిక నిర్మూలన



కార్యక్రమంలో మాట్లాడుతున్న సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ బాషా

కర్నూలు సిటీ: గ్రామీణ మహిళలకు జీవనోపాధుల కల్పన ద్వారా పేదరికాన్ని నిర్మూలించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ బాషా అన్నారు. ఆదివారం స్థానిక కర్నూలు మహిళా మండలి సమాఖ్య కార్యాలయంలో విజన్ బిల్డింగ్‌పై డ్వాక్రా మహిళలకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని సీఈఓ సందర్శించి ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు తమ కలలను స్వయం సహాయక సంఘాల ద్వారా సాకారం చేసుకోవాలన్నారు. ఓ కుటుంబం ఆనందంగా ఉండాలంటే సుస్థిర ఆదాయం ఉండాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వం మహిళలను స్వయం ఉపాధి వైపు ప్రోత్సహిస్తుందన్నారు. పురుషుల కంటే మహిళల్లో ఆర్థిక క్రమ శిక్షణ అధికంగా ఉంటుందన్నారు. గతంలో పొదుపు మహిళలకు బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు ఆసక్తి చూసేవి కాదని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. రుణాలు ఇస్తామని వెంట పడుతున్నాయన్నారు. మహిళలు జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సలీమ్ బాషా, ఏపీడీ శ్రీధర్ రావు, ఎన్ఆర్ఎల్ఎం మేనేజర్ అబ్దుల్ రహీమాన్, ఏపీఎం మల్లికార్జున స్వామి, సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

దంపతుల విషాదాంతం

- బొమ్మగుండన హాల్లిలో ఘటన
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



బోయరాజు, రేఖమ్మ (ఫైల్)

హొళగుంద: వివాహమై రెండేళ్లయ్యింది. భార్యాభర్త అన్యోన్యంగా ఉండే వారు. ఏమైందో ఏమో భర్త ఉరి వేసుకుని, భార్య అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. హొళగుంద మండలం బొమ్మగుండనహళ్లి (బీ.జీ హళ్లి) గ్రామంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. బొమ్మగుండనహళ్లి గ్రామానికి చెందిన రేఖమ్మ(20)ను రెండేళ్ల క్రితం హాలహర్వి మండలం గూళ్యం గ్రామానికి చెందిన బోయరాజు(27)కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి సంతానం కలగలేదు. ఇటీవల భార్యాభర్తలిద్దరూ దసరా పండుగకు బొమ్మగుండనహళ్లికి వచ్చారు. కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి పండుగను ఆనందంగా జరుపుకున్నారు. రెండు రోజుల్లో గూళ్యం రావాల్సి ఉంది. అయితే శనివారం రాత్రి భార్యాభర్తలను ఇంట్లో వదిలి కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లకు వెళ్లి పడుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున రేఖమ్మ ఇంటి వరండాలో విగత జీవిగా పడి ఉండగా, ఆమె భర్త బోయరాజు ఇంటి లోపల ఉరితాడుకు వేలాడుతూ కనబడ్డాడు. ఇద్దరిది ఆత్మహత్యా? హత్యా? మృతికి ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే అనుమానాలను గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు. రేఖమ్మ తల్లి వీరనాగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు వెల్లడించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ఆసుపత్రికి తరలించామని తెలిపారు.

మెదడుకు పదును.. భవితకు వెలుగు

- 'కౌశల్' పోటీలకు నోటిఫికేషన్ విడుదల
- వచ్చే నెల 5 వరకు రిజిస్ట్రేషన్‌కు గడువు
- నవంబరు 21, 22, 23 తేదీల్లో ప్రాథమిక స్థాయి పరీక్ష
- డిసెంబరు 8న జిల్లా స్థాయి, 29, 30 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు
- విజేతలకు ప్రోత్సాహక బహుమతులు



'కౌశల్' పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఈఓ రంగారెడ్డి, కౌశల్ జిల్లా కోఆర్డినేటర్ రంగమ్మ తదితరులు

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు కౌశల్ ప్రతిభాన్వేషణ పోటీలు భారతీయ విజ్ఞాన మండలి, ఆంధ్రప్రదేశ్ సాంకేతిక మండలి సంయుక్తంగా ప్రతి ఏటా నిర్వహిస్తున్నాయి. ఈ ఏడాదికి ఇటీవలే నోటిఫికేషన్ విడుదలైంది. ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి నగదు బహుమతులు అందజేస్తారు. క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్ అనే రెండు రకాల విభాగాల్లో పోటీలు ఉంటాయి. క్విజ్‌కు సంబంధించి 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులకు పాఠశాలస్థాయిలో ఆన్‌లైన్‌లో మొదట పోటీలు నిర్వహిస్తారు. ఉత్తమ మార్కులు వచ్చిన బృందాలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ఒక్కో తరగతి నుంచి ఒక్కో విద్యార్థి కచ్చితంగా ఉండాలి. విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయుల కృషి అనే అంశం మీద క్విజ్ పోటీలు జరుగుతాయి.

ప్రోత్సాహకాలు ఇలా..

మొదటగా నవంబరు 21, 22, 23 తేదీల్లో ప్రాథమిక స్థాయిలో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించి, జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. జిల్లా స్థాయి పోటీలు డిసెంబర్ 8వ తేదీ, రాష్ట్ర స్థాయి పోటీలు డిసెంబర్ 29.30 తేదీల్లో నిర్వహించనున్నారు. జిల్లాస్థాయి పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.7,500, రూ.6,000, రూ.4,500 ఇవ్వనున్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారికి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.15,000, రూ.12,000, రూ.9,000 ఇవ్వనున్నారు. అలాగే ప్రోత్సాహక బహుమతి రూ.6 వేలు చొప్పున ప్రదానం చేయనున్నారు.

పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలకు ఇలా..

పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో ఒక పాఠశాల నుంచి 8, 9 తరగతుల నుంచి ఇద్దరు విద్యార్థులను అనుమతిస్తారు. సాధారణ పోస్టర్ కాంపిటీషన్ జనరల్ థీమ్‌తో పాటు విజ్ఞానశాస్త్ర రంగంలో భారతీయుల కృషి అనే అంశంపై ఉంటుంది. పోస్టర్ ప్రజెంటేషన్, కాంపిటీషన్‌లలో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, జ్ఞాపికలతో పాటు నగదు బహుమతులను అందజేయనున్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.3,000, రూ.2,000, రూ, 1,000 చొప్పున అందజేస్తారు. రాష్ట్ర స్థాయిలో రూ.5,000, రూ.3,000, రూ.2,000 చొప్పున ఇవ్వనున్నారు. ఈ పోటీలలో విద్యార్థులను భాగస్వాములను చేసేందుకు సైన్స్, గణితం ఉపాధ్యాయులు పాఠశాల కో–ఆర్డినేటర్లుగా వ్యవహరించాల్సి ఉంది.

పేర్ల నమోదు ఇలా..

కౌశల్ క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలలో పాల్గొనదల్చిన విద్యార్థులు వ్యక్తిగతంగానైన కానీ, ఆయా స్కూళ్ల ఉపాధ్యాయుల సహాయంతో కానీ పేర్లు నమోదు చేసుకోవచ్చు. ఇందుకు వచ్చే నెల 5వ తేదీ వరకు గడువు ఉంది. www.bvmap.org అనే వెబ్ సైట్‌లో ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చు.

సాంకేతిక 'సహకార'ం

- రూ.3.96 కోట్లతో పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ
- వచ్చే ఏడాది మార్చి ఆఖరికి పూర్తి చేసే విధంగా కసరత్తు
- సొసైటీ లావాదేవీలు ఇక భద్రం



కల్లూరు పీఏసీఎస్

కర్నూలు(అగ్రికల్చర్): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్‌లు) సాంకేతిక హంగులను అద్దుకుంటున్నాయి. లావాదేవీలు పారదర్శకంగా ఉండేందుకు కంప్యూటరీకరణ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.3.96 కోట్లతో ఈ ప్రక్రియ చురుగ్గా జరుగుతోంది. కంప్యూటరీకరణకు చేసే వ్యయంలో 60 శాతం కేంద్రం, 30 శాతం రాష్ట్రం, 10 శాతం నాబార్డు భరిస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పీఏసీఎస్‌లు 99 ఉన్నాయి. కొన్ని సొసైటీల్లో రుణాలకు సంబంధించి రైతులకు సరైన రసీదులు ఇవ్వకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బినామీ పేర్లతో రుణాలు కాజేసిన సంఘటనలు కూడా కొన్ని వెలుగు చూశాయి. ఈ నేపథ్యంలో లావాదేవీల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు కంప్యూటరీకరణ ప్రక్రియ చేపట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పీఏసీఎస్‌ల్లో దాదాపు 5 లక్షల మంది సభ్యులు ఉన్నప్పటికీ దాదాపు 2 లక్షల మంది మాత్రమే రుణాలు తీసుకోవడం, రికవరీ చేస్తున్నారు. ఇటువంటి వారి వివరాలన్నీ కంప్యూటర్లలోకి రానున్నాయి.

మార్చి చివరిలోగా పూర్తి

కంప్యూటరీకరణలో భాగంగా ఫస్ట్ హ్యాండ్ రిపోర్టు చేయడం పూర్తి అయింది. ఇందులో సొసైటీల బేసిక్ డేటాను పొందుపరిచారు. సహకార శాఖ, డీసీసీబీ, పీఏసీఎస్‌లు సంయుక్తంగా ఫీల్డ్ విజిట్ రిపోర్టు పూర్తి చేశాయి. రానున్న రోజుల్లో కంప్యూటరీకరణకు సంబంధించి చట్టబద్ధమైన ఆడిట్ జరుగాల్సి ఉంది. మాన్యువల్‌గా రికార్డుల్లో ఉన్న డేటాను కంప్యూటర్‌లలో నమోదు చేయాలి. కంప్యూటీకరణ చేసిన డేటాను ఆన్‌లైన్‌లోకి అప్‌లోడ్ చేయాల్సి ఉంది. దీంతో కంప్యూటరీకరణ పూర్తయినట్లు అవుతుంది. ఈ మొత్తం ప్రక్రియను 2024 మార్చి చివరిలోగా పూర్తి చేయాల్సి ఉంది. కంప్యూటరీకరణ కోసం ఒక్కో పీఏసీఎస్‌లో కేంద్రం, రాష్ట్రం, నాబార్డు కలసి రూ.4లక్షలు ఖర్చు చేస్తున్నాయి.

బ్యాంకులుగా..

కంప్యూటరీకరణతో పీఏసీఎస్‌లు బ్యాంకులుగా రూపాంతరం చెందనున్నాయి. సభ్యులుగా ఉన్న రైతులకు సంఘాల్లోనే ఖాతాలు ప్రారంభిస్తారు. రైతులకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) ద్వారా అందే ఆర్థిక లబ్ధి కూడా సొసైటీ ఖాతాల్లోనే జమ అవుతుంది. వ్యవసాయ రుణాలే కాకుండా వివిధ వ్యాపార రుణాలు కూడా ఇవ్వవచ్చు. మొత్తం లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోనే చేపట్టడం వల్ల పారదర్శకతకు పెద్దపీట వేసినట్లు అవుతుంది. పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణతో గ్రామీణ ప్రాంతాలకు బ్యాంకింగ్ సేవలు మరింత అందుబాటులోకి రానున్నాయి.

బహుళ సేవలు

పీఏసీఎస్‌లు బ్యాంకింగ్ సేవలు అందించడంతో పాటు కామన్ సర్వీస్ సెంటర్లుగా పనిచేస్తున్నాయి. ఒకప్పుడు రైతులకు రుణాలు ఇవ్వడం, రికవరి చేయడం వరకు మాత్రమే సంఘాలు పరిమితం అయ్యాయి. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ఇవి బహుళ సేవలు అందిస్తున్నాయి. నంద్యాల జిల్లాలోని గుండుపాపల, పోలూరు సొసైటీలు పెట్రోలు పంపులు నిర్వహిస్తున్నాయి. మొబైల్ రిచార్జీ, కరంటు బిల్లులు కట్టించుకోవడం వంటి వాటిని నిర్వహిస్తున్నాయి. సొసైటీలకు మల్టీపర్పస్ గోదాములు కూడా నిర్మిస్తున్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఫంక్షన్ హాల్స్ వంటి వాటిని కూడా నిర్మిస్తున్నారు. ఇందుకు ఆప్కాబ్, నాబార్డు, డీసీసీబీలు రుణ సదుపాయం కల్పిస్తున్నాయి.

పారదర్శకతకు పెద్దపీట



పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఇందు కోసం ప్రతి పీఏసీఎస్‌లో రూ.4 లక్షలు ఖర్చు చేస్తున్నాం. వచ్చే ఏడాది 4 మార్చి నెల చివరి లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నాం. కంప్యూటరీకరణతో పీఏసీఎస్‌ల్లో జరిగే లావాదేవీల్లో పారదర్శకత పెరుగుతుంది. బ్యాంకుల తరహాలో సొసైటీలు పనిచేస్తాయి.

– పి.రామాంజనేయులు, సీఈఓ, కర్నూలు డీసీసీబీ

శుభ పరిణామం



ఇప్పటి వరకు సొసైటీల లావాదేవీలు మాన్యువల్‌గా జరుగుతుండటం వల్ల కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. కంప్యూటరీకరణతో సొసైటీ నిర్వహణలో పారదర్శకత ఏర్పడుతుంది. ప్రభుత్వం పీఏసీఎస్‌ల పటిష్టతకు పెద్దపీట వేస్తుండటం శుభపరిణామం. కల్లూరు పీఏసీఎస్‌ను లాభాల బాట పట్టించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

–జి.శివశంకర్‌రెడ్డి, చైర్మన్, కల్లూరు పీఏసీఎస్

క్లుప్తంగా

విద్యార్థి అదృశ్యం


ప్రవీణ్(ఫైల్)

కొలిమిగుండ్ల: బందార్లపల్లె గ్రామానికి చెందిన విద్యార్థి గోగుల ప్రవీణ్ అదృశ్యమైనట్లు ఎస్‌ఐ రమేష్‌రెడ్డి ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన గోగుల రామచంద్ర కుమారుడు ప్రవీణ్ అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. రోజు మాదిరిగానే శనివారం పాఠశాలకు వెళ్లాడు. సాయంత్రం పాఠశాల ముగిశాక ఇంటికి చేరుకోలేదు. చీకటి పడినా కుమారుడు ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు పాఠశాల పరిసరాలతో పాటు చుట్టు పక్కల ఉన్న బంధువుల ఊర్లకు వెళ్లి ఆరా తీశారు. ఆచూకీ లభించక పోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు నుంచి కిందకు దిగుతూ...


మృతి చెందిన ఆచారి

డోన్ టౌన్: స్టేషన్‌లో ఆగక ముందే రైలులో నుంచి కిందకు దిగే ప్రయత్నంలో ఓ ప్రయాణికుడు తీవ్రంగా గాయపడి దుర్మరణం చెందాడు. రైల్వే ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. శనివారం రాత్రి కాచిగూడ నుంచి చెంగల్‌పట్టు వెళ్లే రైలు డోన్ స్టేషన్‌లో ఆగే ముందే రైలులో నుంచి రంగాపురానికి చెందిన రామలింగాచారి (40) కిందకు దిగుతూ రైలు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో మృతుని కాళ్లు తెగిపోవడంతో తీవ్ర రక్తస్రావానికి గురయ్యాడు. వెంటనే డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఇతను స్వగ్రామం అనంతపురం జిల్లా యాడికి మండలం కోన ఉప్పలపాడు కాగా.. ఉపాధి నిమిత్తం భార్య స్వగ్రామం రంగాపురంలో నివాసం ఉంటున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వెలుగోడు: బోయరేవుల–మోతుకూరు గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం రాత్రి పెద్దదేవళాపురం గ్రామానికి చెందిన ఆర్లగడ్డ పెద్ద సుబ్బయ్య (55) టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వస్తుండగా గుర్తు తెలియని కారు ఢీకొంది. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం 108లో నంద్యాల ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

లారీని ఢీకొన్న బైక్ యువకుడి దుర్మరణం

ఆదోనిఅర్బన్: పట్టణ శివారులోని ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డులో బైక్, లారీ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. ఆదోని ఎస్కేడీ కాలనీకి చెందిన గురుచరణ్ (23) ఆదివారం బైక్‌పై ఎమ్మిగనూరు వైపు వెళ్తున్నాడు. బైపాస్ రోడ్డు వద్ద గమనించకుండా ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆ యువకుడిని స్థానికులు ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యంలోనే ప్రాణాలు విడిచాడు.విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తి చేసిన గురుచరణ్ విదేశాల్లో ఎమ్మెస్సీ చేసేందుకు పాస్‌పోర్టు సిద్ధం చేసుకుంటున్నట్లు తండ్రి నాగరాజు తెలిపారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

ట'మాట'ను నిలబెట్టేలా!

- రూ.12.05 కోట్లతో ప్రాసెసింగ్ సెంటరు ఏర్పాటు
- 3.60 ఎకరాల్లో ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు


పత్తికొండ వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన టమాట (ఫైల్)

కర్నూలు(అగ్రికల్చర్): దశాబ్దాల నాటి కల సాకారం అవుతోంది. పత్తికొండలో టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే భూమిని గుర్తించడం, దానిని ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీకి స్వాధీనం చేయడం తదితర కార్యక్రమాలన్నీ పూర్తయ్యాయి. ఇటీవలే జీవో ఆర్‌టీ నంబరు 739 కూడా జారీ అయ్యింది. 2023–24 సంవత్సరానికి సంబంధించి మొదటి విడత వైఎస్సార్ రైతుభరోసా కింద పెట్టుబడిసాయం విడుదల చేసేందుకు పత్తికొండకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి...టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు హామీ ఇచ్చారు. అప్పటి నుంచి ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఉన్నతాధికారులు, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. పత్తికొండలోని సర్వే నంబర్లు 286/1ఏ3, 286/1ఏ4, 286/1ఏ5ల్లోని 3.60 ఎకరాల్లో రూ.12.05 కోట్లతో టమాట ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటు కానుంది. ఈ కేంద్రంలో నెలకు 1,200 టన్నులు, ఒక సీజన్‌లో 3,600 టన్నుల టమాట ప్రాసెసింగ్ కానుంది. ఈ కేంద్రంలో కార్యక్రమాలను 15 ఏళ్ల పాటు లీజ్ ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ ప్రాతిపదికన నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఒకరిని బిడ్డింగ్ విధానంలో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎంపిక చేస్తుంది. టమాటకు అన్‌సీజన్ ఉన్నప్పుడు ఈ కేంద్రంలో ఇతర పండ్లను కూడా ప్రాసెసింగ్ చేయనున్నారు. త్వరలోనే ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సంబంధించి భూమి పూజ నిర్వహించే అవకాశం ఉంది. జిల్లాలో పత్తికొండ, ఆస్పరి, దేవనకొండ, ప్యాపిలి, కృష్ణగిరి, తుగ్గలి, పెద్దకడుబూరు, హాలహర్వి, ఆదోని, కోడుమూరు, ఓర్వకల్లు, కల్లూరు, వెల్దుర్తి తదితర మండలాల్లో టమాట విస్తారంగా సాగవుతోంది. ప్రాసెసింగ్ సెంటరు ఏర్పాటుతో రానున్న రోజుల్లో టమాటకు మంచి రోజులు రానున్నాయి.

గిట్టుబాటు ధరలు లభించే అవకాశం

పత్తికొండలో టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు అనేది దశాబ్దాల నాటి కల. ప్రతి ఎన్నికల్లో టీడీపీ నేతలు టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుపై హామీలు గుప్పిస్తూ ఓట్లు పొందుతున్నారు. కాని కార్యరూపం దాల్చలేదు. టమాటకు గిట్టుబాటు ధర లభించక ప్రతి ఏటా రైతులు నష్టపోతూనే ఉన్నారు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత టమాట రైతుల అభ్యున్నతికి చర్యలు చేపట్టింది. ప్రతి ఏటా ధరలు పడిపోయినపుడు మార్కెటింగ్ శాఖ అధికారులను రంగంలోకి దింపి వందలాది టన్నుల టమాట కొనుగోలు చేస్తోంది. తాజాగా ఏళ్లనాటి కలను నిజం చేస్తూ వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ప్రాసెసింగ్ సెంటరు ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చిన కొన్ని నెలల్లోపే ఉత్తర్వులు జారీ చేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. టమాట ప్రాసెసింగ్ సెంటరు ఏర్పాటుతో రైతులకు గిట్టుబాటు ధరలు లభించే అవకాశం ఏర్పడింది.

విజిటబుల్ సోలార్ డ్రైయర్లు

టమాట పంట మార్కెట్‌లో ఎక్కువగా ఉండి ధరలు లేనప్పుడు సోలార్ డ్రైయర్లకు సరఫరా చేసి టమాట ఫ్లేక్స్ తయారు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే 150 సోలార్ డ్రైయర్లు ఏర్పాటు అయ్యాయి. ఈ ఏడాది చివరి నాటికి 3,500 సోలార్ డ్రైయర్ల ఏర్పాటుకు ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ చర్యలను వేగవంతం చేసింది. సోలార్ డ్రైయర్లకు ఏడాదికి దాదాపు 1,500 టన్నుల టమాట అవసరం అవుతుంది. ఒక వైపు ప్రాసెసింగ్ యూనిట్, మరోవైపు సోలార్ డ్రైయర్లు ఏర్పాటు వల్ల టమాటకు మంచి రోజులు వచ్చినట్లేనన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

జీవో వచ్చింది



పత్తికొండ సమీపంలో టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వం జీవో ఆర్‌టీ నంబరు 739 జారీ చేసింది. 3.60 ఎకరాల్లో రూ.12.05 కోట్లతో టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కానుంది. దీంతో రైతులకు గిట్టుబాటు ధరలు లభించే అవకాశం ఉంది. టమాట ప్రాసెసింగ్ యూనిట్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా సోలార్ డ్రైయర్లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందు కోసం ప్రభుత్వం బ్యాంక్ ఆఫ్ బరోడాతో ఒప్పందం చేసుకుంది. టమాట ధరలు పూర్తిగా తగ్గినపుడు సోలార్ డ్రైయర్ల కోసం కొనుగోలు చేస్తారు. –ఉమాదేవి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ

ఆనాటి హృదయాల ఆనంద గీతం


రక్తదానం చేస్తున్న పూర్వ విద్యార్థి, చిత్రంలో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ తదితరులు


నృత్యం చేస్తున్న పూర్వ విద్యార్థులు

- జ్ఞాపకాలతో తడిచిన శ్రీశైలం ప్రాజెక్ట్ ఉన్నత పాఠశాల
- ఘనంగా ముగిసిన వజ్రోత్సవాలు
- రక్తదానం, అవయవ దానం చేసిన పూర్వ విద్యార్థులు


బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంప్రాజెక్ట్: చదువులమ్మ ఒడిలో కలసి చదువుకున్న ఎంతో మంది ఉన్నత చదువులు, ఉద్యోగాలు, వ్యాపారాలు అంటూ ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. వారంతా చాలా ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. 'ఏరా బాగున్నారా.. ఏమండీ గుర్తు పట్టారా.. గురువుగారూ ఆరోగ్యం బాగుందా'.. అంటూ కుశల ప్రశ్నలు వేసుకుంటూ ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఇందుకు శ్రీశైలం ప్రాజెక్ట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా మారింది. శనివారం మొదలైన శ్రీశైలం ప్రాజెక్ట్ వజ్రోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్, సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో వజ్రోత్సవాలు పండుగలా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు తమ వయస్సును మరిచిపోయి చిన్న పిల్లలుగా మారిపోయి ఆనందంతో కేరింతలు కొడుతూ నృత్యాలు చేశారు. తీపి జ్ఞాపకంగా బ్యాచ్‌ల వారీగా ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. అనంతరం కార్యనిర్వాహకులను స్పోసా ఆధ్వర్యంలో సన్మానించి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమానికి ముందుగా ఉదయం సున్నిపెంట గ్రామంలో భారీ ఎత్తున బైక్‌ర్యాలీ చేశారు. పాఠశాల ఆవరణలో ఇండియన్ రెడ్ క్రాస్‌సొసైటీ నంద్యాల జిల్లా చైర్మన్ దస్తగిరి, శ్రీశైలం చైర్మన్ నాగేషుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 150 మంది పూర్వ విద్యార్థులు రక్తదానం చేశారు. అలాగే వంద మంది అవయవ దానానికి అంగీకార పత్రాలను సమర్పించారు. ఉత్సవాల ముగింపు సభలో స్పోసా చైర్మన్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జీవిత కాలం వరకు పాఠశాల అభివృద్ధి కోసం పాటు పడాలన్నారు. సమ సమాజ ఏర్పాటుకు హితోదికంగా సేవలు అందించినపుడే మానవతకు అర్థం ఉంటుందన్నారు. కులమతాలకు అతీతంగా ప్రాంతీయ బేధాలు లేకుండా అందరూ కలిసికట్టుగా ఉండాలని కోరారు.

మహానందిలో సంప్రోక్షణ పూజలు


మహానందిలో ఆలయ శుద్ధి పూజలు నిర్వహిస్తున్న పండితులు

మహానంది: పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా శనివారం సాయంత్రం మూసివేసిన మహానంది ఆలయ ద్వారాలు గ్రహణం అనంతరం ఆదివారం ఉదయం 6 గంటలకు ఆలయ తలుపులు తీసి శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, ప్రధానార్చకులు అర్జునశర్మ, పండిత బృందం ఆలయ శుద్ధి, సంప్రోక్షణ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహానందీశ్వర స్వామివారికి రుద్రాభిషేకం, కామేశ్వరీదేవికి కుంకుమార్చన పూజలు జరిపారు. అనంతరం ఆలయ శుద్ధి, సంప్రోక్షణ నిర్వహించి భక్తుల దర్శనాలను యథావిధిగా కొనసాగించారు. ఆదివారం సెలవు రోజు కావడంతో మహానంది భక్తజనంతో కిటకిటలాడింది. స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు శ్రీకామేశ్వరీదేవి మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు.

చంద్ర గ్రహణానంతరం ఆలయశుద్ధి

శ్రీశైలం: పాక్షిక చంద్రగ్రహణం కారణంగా శనివారం సాయంత్రం ద్వారాలు మూసిన శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయాన్ని ఆదివారం వేకువజామున 5 గంటలకు తిరిగి తెరిచి ఆలయ శుద్ధి, సంప్రోక్షణ పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 7 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతించారు. ఆన్‌లైన్ ద్వారా అభిషేకం, కుంకుమార్చన తదితర ఆర్జిత సేవా కర్తలకు ఉదయం 7.30 గంటలకు వీఐపీ ఆన్‌లైన్ దర్శనాలను 9 గంటల నుంచి అనుమతించారు. చంద్రగ్రహణం కారణంగా స్వామిఅమ్మవార్లను శనివారం దర్శించుకోలేని వారు ఆదివారం ఉదయం స్వామిఅమ్మవార్లను దర్శించుకుని అతిశీఘ్ర దర్శన టిక్కెట్లు తీసుకున్న వారు ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు.





ఆకాశంలో అద్భుతం

కొత్తపల్లి: పున్నమి చంద్రుడు గ్రహణ సమయంలో కనువిందు చేశారు. శనివారం అర్ధరాత్రి తర్వాత 1.05 గంటల నుంచి 2.22 గంటల వరకు పాక్షిక చంద్ర గ్రహణం కనిపించింది. ఆసక్తి ఉన్న పలువురు అర్ధరాత్రి వరకు మేల్కొని చంద్రగ్రహణాన్ని వీక్షించారు.

ఈత పోటీల్లో శ్రీనివాసరెడ్డి జయకేతనం

- మూడు గోల్డ్, ఒక సిల్వర్ మెడల్ కైవసం


జాతీయ పతాకంతో ఈత పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన శ్రీనివాసరెడ్డి

కర్నూలు కల్చరల్: దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ ఈత పోటీల్లో జిల్లా వాసి ఎం.ఎల్. శ్రీనివాసరెడ్డి సత్తా చాటి జయకేతనం ఎగుర వేశారు. హేమర్ స్పోర్ట్స్ ఎగ్జిబిషన్ ఆర్గనైజేషన్ వారు ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించిన మాస్టర్స్ ఈత పోటీల్లో పలు దేశాల స్విమ్మర్స్ పాల్గొన్నారు. అందులో శ్రీనివాసరెడ్డి ప్రతిభ కనబరిచి మూడు గోల్డ్, ఒక సిల్వర్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. ప్యాపిలి మండలం సిద్ధనగట్టు గ్రామానికి చెందిన ఈయన కర్నూలు నగరంలో స్థిరపడి ప్రముఖ న్యాయవాదిగా గుర్తింపు పొందారు. ఈయన కర్నూలు డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్ లైఫ్ మెంబర్‌గా ఉన్నారు. క్రమం తప్పకుండా స్విమ్మింగ్ చేస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి మాస్టర్స్ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొంటూ పతకాలు సాధిస్తున్నారు. దుబాయ్‌లో నిర్వహించిన ఈత పోటీల్లో 64–65 సంవత్సరాల విభాగంలో ఐదు ఈవెంట్లలో పాల్గొనగా నాలుగు పతకాలు సాధించారు. 50 మీటర్ల ఫ్రీ, బ్యాక్, బ్రెస్ట్ స్ట్రోక్ ఈవెంట్లలో మొదటి స్థానంలో నిలచి గోల్డ్ మెడల్, 100 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ ఈవెంట్‌లో ద్వితీయ స్థానంలో నిలచి సిల్వర్ మెడల్ సాధించి భారత జాతీయ పతకాన్ని రెపరెపలాడించారు. మెడల్స్ సాధించిన శ్రీనివాసరెడ్డికి మాస్టర్స్ స్విమ్మర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈవో రమణ, స్విమ్మింగ్ పూల్ కోచ్ నటరాజరావు, పలువురు స్విమ్మర్లు, న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

పేలిన టిప్పర్ టైర్.. నలుగురికి గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం


ప్రమాదానికి కారణమైన పేలిన టిప్పర్ టైర్

ఎమ్మిగనూరురూరల్: టిప్పర్ టైర్ పేలటంతో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన పట్టణంలోని శివన్న నగర్ ప్రాంతంలోని జగనన్న కాలనీ దగ్గర ఆదివారం చోటుచేసుకుంది. కాలనీలో గృహ నిర్మాణాల కోసం గ్రావెల్ మట్టిని టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. టిప్పర్లోని మట్టిని కిందకు వేసే క్రమంలో విద్యుత్ తీగలు తాకి నిప్పురవ్వలు రేగటంతో డ్రైవర్ అప్రమత్తమై ట్రాలీనికి కిందకు దించారు. ప్రమాదం తప్పింది అనుకున్న సమయంలో టిప్పర్ వెనుక భాగం టైర్ నుంచి గాలి లీకైంది. గమనించిన మరో టిప్పర్ డ్రైవర్, పనిచేసే వారు టైర్‌ను పరిశీలిస్తుండగా పెద్ద శబ్దంతో పేలిపోయింది. దీంతో డ్రైవర్ కృష్ణ, సూపర్‌వైజర్ వెంకటేష్, రామాంజనేయులు, బాషాలకు గాయాలు అయ్యాయి. డ్రైవర్ కృష్ణ శరీరంపై పేలిన టైర్ వచ్చి పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. ఇదే ప్రమాదంలో సూపర్‌వైజర్ వెంకటేష్ ముఖానికి, శరీర భాగాల్లో దెబ్బలు తగిలాయి. నిర్మాణ పనుల దగ్గర ఉన్న హౌసింగ్ డీఈ ప్రసాద్ వెంటనే గాయపడ్డ నలుగురిని 108లో ప్రభుత్వాసుపత్రికి చికిత్స కోసం తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం డ్రైవర్ కృష్ణను మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


లక్ష్మన్న (ఫైల్)

బేతంచెర్ల: హుసేనాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అప్పుల బాధతో తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హెడ్ కానిస్టేబుల్ సజ్జద్ అలీ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోయిని లక్ష్మన్న తనకు ఉన్న 7 ఎకరాల పొలంతో పాటు మరో 9 ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. ఈక్రమంలో సాగుచేసిన పంటలు సరైన దిగుబడి రాక సుమారు రూ. 10 లక్షలు అప్పులు చేశాడు. తీవ్ర మనస్తాపానికి గురైన లక్ష్మన్న శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కొద్ది సేపటి తర్వాత కుటుంబీకులు గుర్తించి కర్నూలు ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. మృతునికి భార్య రాములమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బైక్, ఆటో ఢీకొని ఒకరు దుర్మరణం



మృతి చెందిన మహేష్

నందవరం: మండల పరిధిలోని నాగలదిన్నె, నందవరం రహదారిలోని కనకవీడు క్రాస్ రోడ్డు వద్ద బైక్, ఆటో ఢీకొని బోయ మహేష్(28) అనే వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపిన వివరాలు ఇవి.. ఆదోని టౌన్ వాల్మీకి నగర్‌కు చెందిన బోయ మహేష్, బోయ వెంకటేష్, బోయ తిప్పయ్య అను ముగ్గురు ఆటో డ్రైవర్లు బైక్‌పై నాగలదిన్నె నుంచి ఆదోని బయలు దేరారు. చిన్నకొత్తిలి గ్రామానికి చెందిన కురవ నాగేంద్ర ఆటో నడుపుకుంటూ ఎమ్మిగనూరు నుంచి చిన్నకొత్తిలికి బయలు దేరాడు. నందవరం దాటిన తరువాత కనకవీడు క్రాస్ రోడ్డు వద్ద ఆటోను బైక్ ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో ఆదోని చెందిన మహేష్ తలకు తీవ్ర రక్త గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు వెంకటేష్, తిప్పయ్యకు గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. అలాగే ఆటోలో ప్రయాణిస్తున్న నాగలదిన్నె గ్రామస్తులు షేక్ బడేసాబ్, ముల్లా సలీమాకు గాయాలు కావడంతో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో చికిత్స పొందుతున్నారు. ఆటో డ్రైవర్ నాగేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

కర్నూలు: నగరంలోని బుధవారపేట జవారి వీధిలో నివాసముంటున్న గుజర్ వెంకటరమణ సింగ్ (38) అదృశ్యమయ్యాడు. ఈనెల 19వ తేదీ ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంతవరకు తిరిగి రాలేదు. అతని కోసం కుటుంబ సభ్యులు కర్నూలు నగరంతో పాటు చుట్టుముట్టు గ్రామాల్లో గాలించారు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించకపోవడంతో మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేక ఇబ్బంది పడేవాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గీతల డిజైన్, రోజ్ కలర్ షర్టు, బ్రౌన్ కలర్ ప్యాంట్ వేసుకున్నాడని భార్య సంధ్యా బాయి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మూడో పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.


దేవనకొండ మండలం అలారుదిన్నె గ్రామం సమీపంలో ఉన్న హంద్రీ వంతెన సమీపంలో..


కోడుమూరులోని హంద్రీ బ్రిడ్జి వద్ద విరబూసిన జమ్ము గడ్డి పూలు

పుడమికి గడ్డిపూల సొగసు

శ్వేత వర్ణంలోని జమ్ము గడ్డి పూలు ఎండకు మిలమిల మెరుస్తూ ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తున్నాయి. ఓ వైపు నీలాకాశం .. మరో వైపు ఆకు పచ్చని అందాల మధ్యన గడ్డి పూలు హంద్రీనదికి సరికొత్త సొగసును తెచ్చాయి. కోడుమూరు, దేవనకొండ ప్రాంతాల్లో హంద్రీనదిలో స్వల్పంగా నీటి ప్రవాహం ఉండటంతో జమ్ము గడ్డి పూలు విరబూశాయి. అటుగా వెళ్లే ప్రయాణికులు, రైతులను ఈ పూలు కనువిందు చేస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు